
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
7
తిరుపతి
జిల్లా వార్తలు
గురువారం 2 అక్టోబరు 2025



కల్కిగా కలియుగనాథుడు

● నేటి చక్రస్నానంతో బ్రహ్మోత్సవాలు పరిసమాప్తి



శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో బుధవారం కలియుగనాథుడైన శ్రీవేంకటేశ్వరస్వామి గుర్రమెక్కి కల్కిగా దర్శనమిచ్చారు. రాత్రి జరిగిన అశ్వవాహనంపై సెంటుజాజి, మల్లి, కనకాంబరం, కురువేరు మాలలను ధరించి మాడవీధుల్లో ఊరేగి దర్శనమిచ్చారు మలయప్ప. వాహనం ముందు గజరాజులు నడుస్తుండగా, భక్తజన బృందాల భజనలు, కోలాటాలు, జీయంగార్ల వేదమంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ చివరివాహనమైన అశ్వవాహనం కోలాహలంగా జరిగింది. దీంతో వాహన సేవలు ముగిశాయి. కాగా, ఉదయం మహారథంపై అమ్మవార్ల సమేతంగా శ్రీవారు ఊరేగారు. గురువారం ఉదయం చక్రస్నానం, రాత్రి ధ్వజావరోహణంతో బ్రహ్మోత్సవాలు పరిసమాప్తవుతాయి.

- తిరుమల, ఆంధ్రజ్యోతి



తిరుపతి వేదికగా 8, 9 తేదీల్లో
సహకార జాతీయ సదస్సు

తిరుపతి(కలెక్టరేట్), అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): సహకారరంగాన్ని బలోపేతం చేయడం ద్వారా ఆర్థిక వృద్ధిని పెంపొందించడానికి ఈనెల 8, 9 తేదీల్లో తిరుపతిలోని హోటల్ తాజ్ వేదికగా జాతీయస్థాయి సదస్సు జరగనుంది. రాష్ట్ర ప్రభుత్వం ఆతిథ్యమిచ్చే ఈ సదస్సుకు కేంద్ర సహకార మంత్రిత్వ శాఖ కార్యదర్శి ఆశిష్‌కుమార్, అడిషనల్ చీఫ్ సెక్రటరీ సిద్ధార్థజైన్‌తో పాటుసహకార శాఖ కార్యదర్శులు, సహకార సంఘ రిజిస్ట్రార్లు, కేంద్రం, వివిధ రాష్ట్రాల్లోని సహకార రంగాలకు చెందిన అధికారులు, ప్రతినిధులు పాల్గొననున్నారు. ఈ నెల 7న డెలిగేట్లు తిరుపతికి చేరుకోనున్నారు. ఈ సదస్సు కోసం కలెక్టర్ వెంకటేశ్వర్ ఆధ్వర్యంలో కమిటీని నియమించారు.

కొన్ని చోట్ల సహాయ నిరాకరణ

- సచివాలయాలకు వచ్చిన పెన్షన్‌దారులు
- మరికొన్ని చోట్ల ఆలస్యంగా పంపిణీ
- 2,49,344 మందికి పింఛన్ల అందజేత




శ్రీనివాసపురంలో లబ్ధిదారులకుపింఛన్లు పంపిణీ చేస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్ - తిరుపతిలో ప్లకార్డు చూపుతూ పింఛను అందిస్తున్న ఉద్యోగి

తిరుపతి(కలెక్టరేట్), అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): తమ నిరసనలో భాగంగా కొన్ని చోట్ల సచివాలయ ఉద్యోగులు బుధవారం పింఛన్ల పంపిణీకి సహాయ నిరాకరణ చేపట్టారు. తమ సమస్యలను పరిష్కరించాలని వారం రోజులుగా వీరు ఆందోళన చేస్తున్న విషయం తెలిసిందే. ఏపీవీడబ్ల్యూఎస్‌ఈ రాష్ట్ర జేఏసీ పిలుపు మేరకు కొన్ని చోట్ల ఉద్యోగులు క్షేత్రస్థాయిలో పింఛన్లను పంపిణీ చేయలేదు. ఉదయం పది గంటలైనా ఉద్యోగులు రాకపోవడంతో పింఛనుదారులు కొన్ని ప్రాంతాల్లో కార్యాలయాలకు వెళ్లారు. అక్కడే వీరికి పింఛన్లు అందజేశారు. దీనిపై పుత్తూరు పట్టణం ఆరేటమ్మ కాలనీ పరిధిలోని సచివాలయ సిబ్బందిపై టీడీపీ నేత గాలి జీవరత్నం నాయుడు ఆగ్రహం వ్యక్తంచేశారు. 'పెన్షన్ పంపిణీ చేయమని చెబితే అధికారులు ప్రత్యామ్నాయ చర్యలు తీసుకునేవారు కదా. లబ్ధిదారులను కార్యాలయాలకు పిలిపించి ఇబ్బందులకు ఎలా గురిచేస్తారు? ప్రభుత్వానికి చెడ్డ పేరు తెచ్చేలా వ్యవహరిస్తున్నారు' అంటూ ఆయన మండిపడ్డారు. అత్యధిక ప్రాంతాల్లో ఉద్యోగులు ఇళ్లకే వెళ్లి పింఛన్లు అందించారు. ఇక, వెంకటగిరి, సూళ్ళూరుపేట, గూడూరు, నాయుడుపేట, పుత్తూరు మున్సిపాలిటీల్లో ఉదయం 10గంటల తర్వాత పింఛన్లు పంపిణీ చేశారు. చాలాచోట్ల నల్లబ్యాడ్జీలు ధరించి సచివాలయ ఉద్యోగులు పింఛన్లు పంపిణీ చేశారు. ఇంటింటి సర్వే, పింఛన్ల పంపిణీ తమకు అప్పగించొద్దంటూ అధికారులకు వినతిపత్రాలను అందించారు. తిరుపతి కార్పొరేషన్‌లోని కొందరు సచివాలయ ఉద్యోగులు పింఛన్ల పంపిణీ సందర్భంగా ఇంటింటిసర్వే నుంచి విముక్తి కల్పించండంటూ ప్లకార్డులను ప్రదర్శించారు. మొత్తమ్మీద జిల్లాలో 2,62,995 మందికి గాను బుధవారం రాత్రి 7 గంటల వరకు 2,49,344 మందికి (94.81 శాతం) పింఛన్లను పంపిణీ చేశారు. రాష్ట్రంలో జిల్లాకు మూడో స్థానం దక్కింది. తిరుపతి రూరల్ శ్రీనివాసపురం పంచాయతీలో కలెక్టర్ వెంకటేశ్వర్, ఆయా నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలు, నాయకులు పింఛన్ల పంపిణీలో పాల్గొన్నారు.

ఇక రాజమండ్రికి విమానం

రేణిగుంట, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): రేణిగుంట విమానాశ్రయం నుంచి రాజమండ్రికి నూతన విమాన సర్వీసు బుధవారం ప్రారంభమైంది. రాజమండ్రిలో ఉదయం 7.40 గంటలకు బయలుదేరిన అలయన్స్ ఎయిర్ విమానాన్ని ఢిల్లీ నుంచి కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు వర్చువల్‌గా ప్రారంభించారు. 9.25 గంటలకు రేణిగుంటకు చేరుకోగా రన్‌వేపై ఎయిర్‌పోర్టు డైరెక్టర్ భూమినాథన్, అలయన్స్ ఎయిర్ సంస్థ ప్రతినిధులు స్వాగతం పలికారు. ఇక్కడ తొలి టికెట్ కొన్న ప్రయాణికుడితో కేక్ కట్ చేయించారు. 9.50 గంటలకు విమానం బయలుదేరింది. ప్రతి మంగళ, గురు, శనివారం ఈ సర్వీసు నడవనున్నట్లు ఎయిర్‌పోర్టు అధికారులు తెలిపారు.



ప్రయాణికుడికి తొలి టికెట్ అందిస్తున్న ఎయిర్‌పోర్టు డైరెక్టర్









సంస్కృత వర్సిటీ పరీక్షా నియంత్రకులుగా సచ్చిదానందమూర్తి




తిరుపతి(విశ్వవిద్యాలయాలు), అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి) : తిరుపతి సంస్కృత విశ్వవిద్యాలయం పరీక్షా నియంత్రకులుగా ఎడ్యుకేషన్ విభాగం ఆచార్యులు ఎ.సచ్చిదానందమూర్తిని నియమించారు. ఆ మేరకు బుధవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. పలువురు అభినందించారు.

థ్యాంక్యూ సార్...!

కలెక్టర్‌కు ఆటోనగర్‌వాసుల కృతజ్ఞతలు

తిరుపతి(కలెక్టరేట్), అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): నిషేధిత జాబితాలో ఉన్న తిరుపతి ఆటోనగర్ స్థలాలకు విముక్తి కల్పించిన నేపథ్యంలో ఎస్వీ ఆటోనగర్ సర్వీసెస్ సొసైటీ, ప్లాట్ ఓనర్స్ తరఫున కలెక్టర్ వెంకటేశ్వర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లో కలెక్టర్‌తోపాటు జేసీ శుభం బన్సల్, ఏపీఐఐసీ జడ్ఎం విజయ్‌భరత్‌రెడ్డిని కలిసి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. నేతలు లోకనాథరెడ్డి, దేవేంద్రరెడ్డి, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.



మహిషాసురమర్దినిగా తాతయ్యగుంట గంగమ్మ



తిరుపతి(కల్చరల్), అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి) : శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా తాతయ్యగుంట గంగమ్మ ఆలయంలో బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. విశేష అభిషేకాల అనంతరం మూలవిరాట్టుకు మహిషాసురమర్దిని అలంకారం చేశారు. ఉభయదారులుగా వ్యవహరించిన పాలకమండలి చైర్మన్ నైనార్ మహేష్ యాదవ్ పూజా ద్రవ్యాలను హోమగుండంలో సమర్పించారు. సాయంత్రం అమ్మవారి ఉత్సవమూర్తిని మహిషాసుర మర్దినిగా అలంకరించి ఊంజల్ సేవ నిర్వహించారు. పల్లివీధిలోని వేశాలమ్మ, ఆర్టీసీ బస్టాండు సమీపంలోని తాళ్లపాక పెద్దగంగమ్మ, పాత మున్సిపల్ ఆఫీసు ఆనుకుని ఉండే నడివీధి గంగమ్మ మహిషాసుర మర్దినిగా అభయమిచ్చారు. కపిలేశ్వర స్వామి ఆలయంలో కామాక్షి అమ్మవారు సరస్వతీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.

స్వర్ణకవచ అలంకరణలో అన్నపూర్ణాదేవి

తిరుపతి అర్బన్ (ఆంధ్రజ్యోతి): స్థానిక లక్ష్మీపురం కూడలిలోని అన్నపూర్ణదేవి ఆలయంలో బుధవారం రాత్రి అమ్మవారు స్వర్ణకవచ అలంకరణలో దర్శనమిచ్చారు. కొత్తవీధిలోని వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయంలో మూలమూర్తి గరుడవాహన వైష్ణవిదేవిగా, ఉత్సవమూర్తి శక్తి పూజ అలంకరణలో భక్తులను కటాక్షించారు.

సరస్వతిదేవిగా బొంతాలమ్మ

తిరుపతి(జీవకోన) (ఆంధ్రజ్యోతి): కరకంబాడి రోడ్డులోని బొంతాలమ్మ ఆలయంలో అమ్మవారు బుధవారం సరస్వతీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.













ఆంధ్రజ్యోతి క్లాసిఫైడ్స్

తిరుపతి - 9703618708, 9030367786
9703618705, 9703618710
9985411629, 9985410347, 9985411003
చిత్తూరు - 9985411584, 9985403122
మదనపల్లి - 9985417476, 9848161191
కుప్పం - 9985403032 పలమనేరు - 9985403032
పుంగనూరు - 9985403204, పీలేరు - 9985403045
పుత్తూరు - 9985411598, శ్రీకాళహస్తి - 9985411596

TO-LET

తిరుపతి, నిమ్మకాయలవీధి నందు షాపులకు మరియు గోడౌన్‌కు అనుకూలమైన భవనం అద్దెకు కలదు. సంప్రదించండి. సెల్: 98483 15414

AJT -246079

వాటర్ ప్రూఫింగ్

స్లాబ్ లీకేజీలు, బాత్రూమ్ లీకేజీలు, వాటర్ ట్యాంక్ లీకేజీలు, గోడ చెమ్మలకు పగలకొట్టకుండా గ్యారెంటీగా వర్క్ చేయబడును. సంప్రదించండి. సెల్: 93465 40767

AJT -240225

TO-LET

తిరుపతి - జై నగర్, బ్లిస్ హోటల్ వెనుక 60 అంకణముల వేటి విశ్వవిహార్ బిల్డింగ్ జి+3 ఉమెన్స్ హాస్టల్ కొరకు అద్దెకు కలదు. సంప్ర. : 99895 68666

AJT - 246078

కళ్యాణ వేదిక

★ ఆర్యవైశ్య & అందరికీ 1ST & 2ND సంబంధాలు చూడబడును. రిజిస్ట్రేషన్ ఫీజు 2118/ మా వద్ద చాలా ప్రొఫైల్స్ కలవు. సంప్ర: RK మ్యారేజ్ బ్యూరో - 8332000801 AJH-003503

CHANGE OF NAME

I, PACHIKALA ANJALI, W/o PACHIKALA CHIRAMJEEVI, R/o D.No.6-68A, Thurpu Harjarawada, Jillellamanda, Kambhamvaripalle Mandal, Annamayya Dist., AP. My name changed from PACHIKALA ANJALI (Old Name) to DODDI PEDDA ANJANAMMA (New Name).

AJT -1680

WANTED

తిరుపతి ఏజెన్సీ చంద్రగిరి నందు పనిచేయుటకు అనుభవం గల టెలికాలర్స్ (M/F) కావలెను. జీతం 25K+More ఇన్సెంటివ్స్. సెల్: 94410 74755

AJT -1679

బంగారం కొనబడును

మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్, ఫైనాన్స్‌లో తాకట్టులో వున్నవి మా డబ్బుతో విడిపించి కొనబడును. స్పాట్ క్యాష్, పికప్ చేయబడును.(రిజిస్టర్డ్ పోలీస్ డిపార్టుమెంట్) గోల్డెన్ ట్రేడింగ్ కంపెనీ సంప్ర:7382114647.

AJA- 246733

EDUCATION

➾ Join BSc AI / CSc over 60%, Maths in 10+2 get 5000 Fee dis, Join M.Com / MA Eng / MSW by 6/10, 3000 Fee dis, 9177408565

AJG-248895

పాఠకులకు ముఖ్యగమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నష్టపోయిన/క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు. మేనేజర్ - ఏడివిటి

నాపై ఆరోపణలు నిరూపించకపోతే మీ ఇంటి ముందు కూర్చుంటా

● వైసీపీ నేతలపై డిప్యూటీ మేయర్ మండిపాటు



తిరుపతి(ఎంఆర్‌పల్లె), అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): శ్మశాన స్థలాన్ని ఆక్రమించానని నాపై వైసీపీ కార్పొరేటర్ భర్త శేఖర్‌రెడ్డి తప్పుడు ఆరోపణ చేశారు. వాటిని నిరూపించమని ఎంఆర్‌పల్లెకే వెళ్లి సవాల్ చేస్తే.. ఈరోజు మీడియాతో సంబంధం లేని మాటలు మాట్లాడారు. నాపై వ్యక్తిగత ఆరోపణలు చేశారు. మా ఇంటి బాడుగ ఎలా కడుతున్నానని ప్రశ్నించారు. నాపై చేసిన ఆరోపణలకు నేను ఆధారాలతో పాటు వివరణ ఇచ్చా. అలాగే, ఆయన నాపై చేసిన ఆరోపణలను ఆధారాలతో నిరూపించాలి. లేదంటే శనివారం ఉదయం 11 గంటలకి ఆయన ఇంటి ముందు టెంట్ వేసి కూర్చుంటా' అని డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ స్పష్టం చేశారు. పద్మావతిపురం నుంచి చోటామోటా నాయకులతో నోటికొచ్చినట్టు ఆరోపణలు చేస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. బుధవారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రజాస్వామ్యయుతంగానే కార్పొరేటర్లు తనను డిప్యూటీ మేయర్‌గా ఎన్నుకున్నారన్నారు. 'మీడియా, ఎన్నికల అధికారిగా ఉన్న జేసీ సాక్షిగా మెజారిటీ కార్పొరేటర్ల ఓటింగ్‌తో డిప్యూటీ మేయర్‌గా ఎన్నికయ్యా. ఇందులో దౌర్జన్యం ఎక్కడుంది? కరుణాకరరెడ్డి దయవల్ల నేను కార్పొరేటర్‌ని అయ్యానన్నారు. అంటే 35 డివిజన్లో వైసీపీకి అభ్యర్థికి కాకుండా సైకిల్‌కు ఓటేయాలని మీ నేత ఆదేశాలు ఇచ్చారా? 2019 ఎన్నికల్లో సుగుణమ్మను బెదిరించి పోస్టల్ బ్యాలెట్లతో గెలిచినట్లు ప్రకటించుకోవడం నిజం కాదా..?' అని ఆయన ప్రశ్నించారు. ఈ సమావేశంలో టీడీపీ నాయకులు రామచంద్రారెడ్డి, కొట్టే హేమంతరాయల్, గంజిసుధాకర్ రెడ్డి, గంగులయ్య, సుబ్బు యాదవ్, ఎస్వీఎం శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్సీపై ఆరోపణలు స్థానికులవి: వైసీపీ నేత

ఆర్సీ మునికృష్ణ ప్రమేయంతోనే ఎంఆర్‌పల్లె శ్మశానానికి ప్రహరీ నిర్మాణ పనులు ఆగాయని స్థానికులు చెబితే, ఆ మాటలనే తాను చెప్పానని వైసీపీ నేత శేఖర్ రెడ్డి అన్నారు. బుధవారం ఆయన తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడారు. శ్మశాన స్థలంపై చిత్తశుద్ధివుంటే పనులు నిలిచిపోయిన వెంటనే ఆయన ఎందుకు రాలేదని ప్రశ్నించారు. తనపై చేసిన ఆరోపణలు నిజమైతే కాణిపాకంలో ప్రమాణం చేయాలని సవాల్ విసిరారు.

పనులు ఆపమని మేమే చెప్పాం

'నగరపాలక సంస్థ ప్రహరీ నిర్మాణం జరుగుతుండగా ఇద్దరు వ్యక్తులు తుడా అప్రూవల్ కలిగిన రెండు పట్టాలను అర్బన్ తహసీల్దారు కార్యాలయానికి తీసుకొచ్చారు. శాంతి భద్రతల సమస్య దృష్ట్యా తహసీల్దారు ఆదేశాల మేరకు మేమే పనులు ఆపమని చెప్పాం' అని డీటీ రామచంద్రయ్య తెలిపారు.

రాస్ సేవలు అభినందనీయం

తిరుపతి(ఆటోనగర్), అక్టోబరు1(ఆంధ్రజ్యోతి) : వృద్ధులకు ఆర్థిక భరోసా కల్పిస్తూ రాస్ చేస్తున్న సేవలు అభినందనీయమని కెనరా బ్యాంక్ డీజీఎం రామ్మోహన్ అన్నారు. తిరుపతిలోని రాష్ట్రీయ సేవా సమితి(రాస్) ప్రధాన కార్యాలయంలో బుధవారం ప్రపంచ వయోవృద్ధుల దినోత్సవం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాస్ వృద్ధులకు, మహిళా సంఘాలకు రుణాలు ఇవ్వడం, అందులో తమ బ్యాంక్‌ను భాగస్వామ్యం చేయడం అదృష్టంగా భావిస్తున్నానని తెలిపారు. అనంతరం వృద్ధులకు చేతికర్రలు, దుప్పట్లు, వీల్‌చైర్‌లు, వినికిడి యంత్రాలు అందించారు.

పక్కాగా పారిశుధ్య పనులు

తిరుపతి, అక్టోబర్ 1(ఆంధ్రజ్యోతి): నగరంలోని అన్ని ప్రాంతాల్లో పారిశుధ్య పనులు పక్కాగా చేపట్టాలని కమిషనర్ ఎన్.మౌర్య అధికారులను ఆదేశించారు. బుధవారం నగరంలోని బైరాగిపట్టెడ, భగత్ సింగ్ కాలని, హథీరాంజి కాలనీ తదితర ప్రాంతాల్లో పారిశుధ్య పనులను ఆమె పరిశీలించారు. చెత్త సేకరణ గురించి ప్రజలను అడిగి తెలుసుకున్నారు. యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహ యాదవ్, మునిసిపల్ ఇంజినీర్ తులసికుమార్, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, శానిటరీ సూపర్‌వైజర్ చెంచయ్య ఉన్నారు.

సౌత్‌జోన్ కబడ్డీ పోటీలకు స్విమ్స్ క్రీడాకారులు

తిరుపతి(వైద్యం), అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): కర్ణాటకలోని బెల్గామ్ రాణిచెన్నమ్మ యూనివర్సిటీలో ఈ నెల 4 నుంచి 7వ తేదీ వరకు జరిగే సౌత్‌జోన్ అంతర విశ్వవిద్యాలయ కబడ్డీ పోటీలకు స్విమ్స్ యూనివర్సిటీకి చెందిన 14 మంది క్రీడాకారులను ఎంపిక చేసినట్లు మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రామ్ బుధవారం తెలిపారు. ఎంపికైన క్రీడాకారులను డైరెక్టర్ ఆర్వీకుమార్, పలు విభాగాల అధికారులు అభినందనలు తెలిపారు.

బ్రహ్మోత్సవాల్లో పలు అభివృద్ధి పనులు

తిరుమల(కల్చరల్), అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి) : బ్రహ్మోత్సవాల్లో ఈ ఏడాది ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో అభివృద్ధి పనులకు రూ.9.41 కోట్లు వెచ్చించినట్లు టీటీడీ సీఈ సత్యనారాయణ తెలిపారు. రాంభగీచా-2లోని మీడియా సెంటర్‌లో బుధవారం ఆయన మాట్లాడుతూ సివిల్, ఎలక్ట్రికల్, బ్రాడ్‌కాస్టింగ్ విభాగంలో రూ.5.61 కోట్లు ఖర్చు చేయగా మిగిలిన నిధులను ఇతర అభివృద్ధి పనులకు వెచ్చించినట్లు చెప్పారు. ఆరు నెలల ముందు నుంచే ప్రణాళికబద్ధంగా సివిల్ పనులు పూర్తి చేసినట్లు తెలిపారు. కాటేజీలు, విశ్రాంతి సముదాయాలకు మరమ్మతులు చేసి అందుబాటులో ఉంచినట్లు చెప్పారు. నాలుగు మాడ వీధుల్లో భజన మండపాలు, పుష్కరిణికి మరమ్మతులు, గ్యాలరీల ఏర్పాటు, క్యూలైన్లు మరమ్మతులు చేశామన్నారు. ఈఈ సుబ్రమణ్యం, డీఈ చంద్రశేఖర్, డాక్టర్ టీ.రవి పాల్గొన్నారు.

IN THE COURT OF IV th ADDITIONAL CIVIL JUDGE (JUNIOR DIVISION) CUM AJFCM TIRUPATI

C.C. 319 of 2015

C.Dilli Reddy (Died) his Lr
C.Vidyasagar.........Complainant
V/s
T.Vijayakumar ....Accused

NOTICE TO ACCUSED UNDER SEC. 82(2)OF CRPC

T.Vijayakumar S/o T. Nadamuni Naidu D.NO. 120, Hathiramji Colony, Tirupati Town, TIRUPATI URBAN MANDAL, TIRUPATI DIST.

పైన తెలిపిన కేసులో సదరు కోర్టు వారు సెక్షన్ 82(2) of CRPC ఆర్డర్ వేసియున్నారు. కనుక నీ హాజరు నిమిత్తం 17-10-2025 వాయిదా వేసియున్నారు. టి. విజయ కుమార్ అయిన నీవు 17-10-2025 తేదిన 10.30 గం॥లకు పైన తెలిపిన కోర్టుకు హాజరు కావలసియున్నది.

C.VIDYASAGAR, Complainant

(By order) TIRUMALASETTY-NAGABHUSHANAM
Advocate, Tirupati
Cell: 92469 99101,79931 02101









దుర్గాదేవిగా మూలస్థాన ఎల్లమ్మ

చంద్రగిరి, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): దేవీనవరాత్రి మహోత్సవాలలో భాగంగా చంద్రగిరిలోని మూలస్థాన ఎల్లమ్మ ఆలయ బుధవారం రాత్రి దుర్గాదేవి అలంకరణలో పూలతేరుపై భక్తులకు దర్శనమిచ్చారు. మిట్టమీద గంగమ్మ ఉత్సవమూర్తికి దుర్గాదేవి అలంకరణ చేసి పులి వాహనంపై అదిష్టించి, గ్రామోత్సవం నిర్వహించారు. తొండవాడలోని ఉగ్రప్రత్యంగిరాదేవిని సిద్ధిదాత్రిగా అలంకరించారు. ● పాకాల: నేంద్రగుంట మూలస్థానమ్మ బుధవారం మహిషాసురమర్దిని అలంకారంలో దర్శనమిచ్చారు. పాకాలలోని శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయం, సత్యమ్మగుడిలో ప్రత్యేక పూజలు చేశారు. ● తిరుపతిరూరల్: తుమ్మలగుంట చెంచువారికాలనీలో మూలస్థాన యల్లమ్మ మహిషాసురమర్దిని అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఎల్ఎస్‌నగర్‌లోని శక్తిచాముండేశ్వరీదేవి వారాహిదేవి అలంకారంలో అనుగ్రహించారు. కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయం నుంచి చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి అమ్మవారికి సారె సమర్పించారు. డిప్యూటీ మేయర్ ఆర్‌సీ మునికృష్ణ, తాతయ్యగుంట గంగమ్మ గుడి ఛైర్మన్ మహేష్‌యాదవ్, సభ్యులు, డాక్టర్ సుకుమార్, సుధారాణి దంపతులు అమ్మవారిని దర్శించుకున్నారు. ● రామచంద్రాపురం: శక్తిపీఠంలో మరకత శక్తికాళీ అమ్మవారు చిన్నమస్తాదేవిగా, సూరావారిపల్లె ఏకవీర ఫౌండేషన్ పీఠం వద్ద దుర్గాదేవి, రాయలచెరువుకట్ట భవాని జలకంఠేశ్వరాలయంలో ఉపాలయాల్లో మహాలక్ష్మి అమ్మవారు, భవాని అమ్మవారు, కామాక్షి అమ్మవారు, పారకాల్వ రాజరాజేశ్వరిదేవి మహిషాసురమర్ధినిగా భక్తులకు దర్శనమిచ్చారు.


దుర్గ అలంకరణలో ఎల్లమ్మ


మహిషాసురమర్దిగా మూలస్థాన ఎల్లమ్మ

పింఛన్ల పంపిణీ

తిరుపతిరూరల్, అక్టోబరు1(ఆంధ్రజ్యోతి): తుమ్మలగుంటలో బుధవారం సచివాలయ ఉద్యోగులతో కలిసి గ్రామ టీడీపీ నేతలు ఫించన్లు పంపిణీ చేశారు. నాయకులు పార్లపల్లె భరత్‌కుమార్‌రెడ్డి, బీరుదాల సిద్దారెడ్డి, రాధారాయల్, గురవారెడ్డి, తులసీరామిరెడ్డి, సెక్రటరీ పి.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.





ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతా: నాని


అర్జీలు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే నాని

భాకరాపేట, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): చంద్రగిరిని ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతామని ఎమ్మెల్యే పులివర్తి నాని అన్నారు. చిన్నగొట్టిగల్లు మండలంలో బుధవారం ఆయన విస్తృతంగా పర్యటించారు. కుమ్మరపల్లెలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు పంపిణీ చేశారు. ఎడంవారిపల్లెలో వాటర్ ప్లాంటును ప్రారంభించారు. జంగావాండ్లపల్లె, దిగవూరు గ్రామాల్లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఇళ్ల స్థలాలు, శ్మశాన వాటికలు, రోడ్డు సదుపాయాలు, భూసమస్యలు, వాటర్ ట్యాంకు, మురుగు నీటి కాలువలు వంటి వాటిపై ప్రజలు వినతులు ఇచ్చారన్నారు. త్వరగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. టీడీపీ మండల అధ్యక్షుడు బెల్లంకొండ మురళి, శివకుమార్, ముత్తం ప్రభాకర్, ఆర్వీ రమణారెడ్డి, మోహన్‌రెడ్డి, మదనమోహన, కృష్ణమూర్తి, చంద్రశేఖర్‌పాల్గొన్నారు.

ఏఎంసీ పాలకవర్గం బాధ్యతల స్వీకరణ


బాధ్యతలు చేపడుతున్న మౌనిక

తిరుచానూరు, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యవసాయ మార్కెట్‌యార్డు పాలకవర్గం తనపల్లి క్రాస్‌లోని మార్కెట్‌యార్డులో బుధవారం బాధ్యతలు చేపట్టింది. ఏఎంసీ ఛైర్‌పర్సన్‌గా మౌనిక, వైస్ ఛైర్మన్‌గా మునికృష్ణారెడ్డి, పలువురు డైరెక్టర్లు బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులకు మార్కెట్‌యార్డులో మరిన్ని వసతులు కల్పిస్తామన్నారు. రైతాంగ శ్రేయస్సు కోసం నిరంతరం కృషి చేస్తామన్నారు. సీఎంచంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి లోకేష్, ఎమ్మెల్యే పులివర్తి నానిలకు కృతజ్ఞతలు తెలిపారు. నిరాడంబరంగా జరిగిన కార్యక్రమంలో టీడీపీ నేతలు ఈశ్వరరెడ్డి, అమిలినేని మధు, మధుశేఖర్, మునిశేఖర్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఏఎంసీ డైరెక్టర్‌కు అభినందన

తిరుపతిరూరల్, అక్టోబరు1(ఆంధ్రజ్యోతి): స్థానిక ఏఎంసీ డైరెక్టర్‌గా బుధవారం బాధ్యతలు చేపట్టిన మల్లంగుంటకు చెందిన లతమ్మను బుధవారం గ్రామ టీడీపీనేతలు దుశ్శాలువా, పుష్పగుచ్ఛంతో సన్మానించి అభినందించారు. నాయకులు పార్లపల్లి మునికృష్ణారెడ్డి, అవిలాల దిలీప్ కుమార్‌యాదవ్ తదితరులు సత్కరించిన వారిలో ఉన్నారు.

క్షురకుల సేవలు అభినందనీయం

తిరుమల(కల్చరల్), అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి):బ్రహ్మోత్సవాల్లో క్షురకుల సేవలు అభినందనీయమని కళ్యాణకట్ట డిప్యూటీ ఈవో వెంకటయ్య పేర్కొన్నారు. స్థానిక రాంభగీచా-2లోని మీడియా సెంటర్‌లో బుధవారం ఆయన మాట్లాడుతూ 1148 క్షురకులు సేవలు అందించారని తెలిపారు. బ్రహ్మోత్సవాల్లో ఏడురోజులకు 2.11లక్షల మంది తలనీలాలు సమర్పించగా నాలుగో రోజు అత్యధికంగా 49,088ల మంది సమర్పించినట్లు వివరించారు. యాత్రికుల వసతి సముదాలయం-5లో కూడా మూడు షిఫ్టులలో 120 మంది నిరంతరాయంగా సేవలు అందించినట్లు తెలిపారు.

వేడుకగా కల్యాణ వెంకన్న రథోత్సవం

తిరుపతిరూరల్, అక్టోబరు1(ఆంధ్రజ్యోతి): తుమ్మలగుంట కల్యాణ వేంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం రథోత్సవం వైభవోపేతంగా సాగింది. వేదపాఠశాల విద్యార్థులు, భక్తులు, గ్రామస్తులు రథాన్ని ముందుకు లాగి స్వామి, అమ్మవార్లను ఊరేగించారు. స్వామివారు రాత్రి అశ్వవాహనంపై కల్కి అవతారంలో వరదహస్తంతో భక్తులను అనుగ్రహించారు. . చెవిరెడ్డి లక్ష్మి, మోహిత్‌రెడ్డి, హర్షిత్‌రెడ్డి పాల్గొన్నారు.




















రక్తదాన శిబిరం


శిబిరాన్ని పరిశీలిస్తున్న వీసీ కృష్ణమూర్తి, రిజిస్ట్రార్ నారాయణ

తిరుపతి(విశ్వవిద్యాలయాలు), అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): జాతీయ స్వచ్ఛంద రక్తదాన దినోత్సవాన్ని పురస్కరించుకుని తిరుపతి సంస్కృత విశ్వవిద్యాలయంలో బుధవారం రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథి జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ జీఎస్ఆర్‌కృష్ణమూర్తి, గౌరవ అతిథి రిజిస్ట్రార్ కెవి.నారాయణ ప్రారంభించారు. పలువురు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. స్విమ్స్ అసిస్టెంట్ ప్రొఫెసర్ ఢిల్లీ ప్రవీణ్‌కుమార్, ఎన్ఎస్‌యూ సీనియర్ మెడికల్ ఆఫీసర్ బి.బాలదత్తాత్రేయ, బి.జయశ్రీ, సి.చిరంజీవి, ఆర్.చంద్రశేఖర్, సంతోష్, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

● చంద్రగిరి, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): రక్తదాన దినోత్సవం సందర్భంగా చంద్రగిరిలోని స్వమాక్స్ సంస్థ కార్యాలయంలో బుధవారం రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో తిరుపతి మెటర్నిటీ డాక్టర్ ప్రసన్నకుమార్ ఠాగూర్ మాట్లాడుతూ సమాజంలో రక్తదానం చేయడంలో యువత ముందుకు రావాలని పిలుపునిచ్చారు. స్వమాక్స్ సీఈవో విశ్వనాథం మాట్లాడుతూ ప్రతిఏటా రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేసి, మెటర్నటీ ఆసుపత్రికి అందజేస్తున్నట్లు తెలిపారు. మెటర్నటీ బ్లడ్ బ్యాంక్ సిబ్బంది, స్వమాక్స్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



సేవింతురే!

దేవుడికి మెట్టుగా మారిన కులశేఖరుడు



తిరుమల గర్భాలయం ముందుండే మెట్టుని కులశేఖర పడి అంటారు. కులశేఖరుడనే పరమ భక్తుడి కోరికను శ్రీనివాసుడు మన్నించడంతో ఈ మెట్టు ఏర్పడిందంటారు. 12 మంది ఆళ్వారులలో 7వ ఆళ్వారు కులశేఖరుడు. క్రీ.శ.725 కాలానికి చెందిన చేర వంశపు రాజు ఇతను. మహా వేదాంతి. విష్ణు భక్తుడు. శ్రీరాముడి ఆరాధకుడు. పురాణ ఘట్టాలు వింటూ ఆ పాత్రల్లో లీనమైపోయేవాడు. తనే ఆ పాత్రనని ఊహించుకునేవాడు. రాజ్యభోగాలను త్యజించి శ్రీరంగంలో పరివ్రాజకుడిగా జీవితాన్ని గడిపాడు. శ్రీవేంకటేశ్వరుడిలో ఐక్యం కావాలనే వాంఛతో ఉండేవాడు. పదకొండు పాశురాలతో స్వామిని కీర్తించాడు. ఈ క్షత్రియ జన్మ నాకు వద్దు. నీ పుష్కరిణిలో వాలే నీటికొంగనైపుట్టినా చాలు.. ఈ కొండవాగుల్లో ఈదే చేపపిల్లగా నైనా పుట్టించు స్వామీ అని వేడుకునేవాడు. కనీసం నీ గర్భాలయంలో తొలి మెట్టుగా అయినా ఉండనీ అని ఆయన చేసిన ప్రార్థనను మన్నించి స్వామి తథాస్తు అన్నాడని, ఆయనే మెట్టుగా మారడంతో కులశేఖర పడిగా అది ప్రసిద్ధి చెందిందని చెబుతారు. సంస్కృతంలో ఈయన 'ముకుందమాల' అనే స్తోత్రాన్ని రచించాడు.

- చిత్రం: సాగర్ గిన్నె



మహారథంపై మహామూర్తి





శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం ఉదయం మహారథోత్సవం నేత్రపర్వంగా సాగింది. భక్తిశ్రద్ధలతో భక్తులు రథాన్ని తాళ్లతో లాగగా.. భారీ బరువైన మహారథం చకచకా ముందుకు కదిలింది. రెండు గంటల్లోనే మహారథోత్సవం ముగిసింది. మహారథంలోని శ్రీభూ సమేత మలయప్పస్వామిని దర్శించుకుని భక్తులు ఆనందపరవశులయ్యారు. మహారథానికి భారీగా హాజరైన భక్తులు రాత్రి అశ్వవాహనంలోనూ పాల్గొనడంతో మాడవీధులు భక్తులతో కళకళలాడాయి.

- తిరుమల, ఆంధ్రజ్యోతి





రథాన్ని లాగుతున్న టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో సింఘాల్, సీవీఎస్వో మురళీకృష్ణ, ఎస్పీ సుబ్బరాయుడు







నయనానందకరంగా నృత్య ప్రదర్శనలు

బ్రహ్మోత్సవాల్లో బుధవారం రాత్రి శ్రీవారి అశ్వవాహన సేవలో నృత్యప్రదర్శనలు నయనానందకరంగా సాగాయి. తొమ్మిది రాష్ట్రాల నుంచి వచ్చిన 21 బృందాల్లోని 539 మంది కళాకారులు తమ ప్రదర్శన ద్వారా భారతీయ సాంస్కృతిక సమైక్యతను చాటి చెప్పారు. అశ్వారూఢసం, కలియుగ వేంకటేశ్వర వైభవం, మోహినీ ఘట్టం, శాస్త్రీయ నృత్యాలు, గౌడీయ నృత్యం, కథక్ నృత్యాలు అలరించాయి. ఆండాల్ పాశురాలు వంటి రూపకాలు, జగన్నాథ రథయాత్ర ఉత్సవ నేపథ్య ప్రదర్శనలు భక్తిపారవశ్యాన్ని కలిగించాయి.

- తిరుమల(కల్చరల్), ఆంధ్రజ్యోతి

శ్రీవారి సర్వదర్శనానికి 12 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 12 గంటల సమయం పడుతోంది. బుధవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలోని 9 షెడ్లు సర్వదర్శన భక్తులతో నిండిపోయాయి. క్యూలైన్ శిలాతోరణం సర్కిల్ వరకు వ్యాపించింది. వైకుంఠంక్యూకాంప్లెక్స్1లో 5కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులువేచి ఉన్నారు.

సోమవారం హుండీ ఆదాయం: రూ.3.77 కోట్లు

మంగళవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 73,275

తలనీలాలు సమర్పించినవారు: 21,973

అశ్వవాహన సేవలో..

బుధవారం రాత్రి జరిగిన అశ్వవాహనసేవలో ఏపీ హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ రాజశేఖర్‌రావు, జస్టిస్ బీవీఎల్ఎన్ చక్రవర్తి పాల్గొన్నారు. వాహనసేవ ప్రారంభ సమయంలో వీరు మలయప్పను దర్శించుకున్నారు.



ఆలయం వద్ద జస్టిస్ రాజశేఖర్‌రావు, జస్టిస్ చక్రవర్తి

దుర్గమ్మకు టీటీడీ పట్టువస్త్రాల సమర్పణ

తిరుమల(కల్చరల్), అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): విజయవాడలోని ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మకు బుధవారం టీటీడీ తరఫున పట్టువస్త్రాలను పాలక మండలి సభ్యులు సుచిత్ర ఎల్లా, నన్నపనేని సదాశివరావు, టి.జానకిదేవి, ఎ.రంగశ్రీ సమర్పించారు. అనంతరం అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

శ్రీవారి సేవలో ప్రముఖులు





జస్టిస్ మానవేంద్రనాథ్ రాయ్ - శివాణి నగరం

తిరుమల, అక్టోబరు1(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని బుధవారం గుజరాత్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మానవేంద్రనాథ్‌రాయ్, మాజీ మంత్రి ఆర్కే రోజా, ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్, సినీ నటి శివాణి నగరం దర్శించుకున్నారు. 'లిటిల్ హార్ట్స్‌ను ఆదరించిన అందరికీ ధన్యవాదాలు. త్వరలో 'హే భగవాన్' చిత్రం విడుదల కానుంది'అని శివాణి తెలిపారు.

కారు బోల్తా పడి వెదురుకుప్పంవాసి మృతి

తిరుపతి(నేరవిభాగం), అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ చిగురువాడ సమీపాన కారు బోల్తా పడి ఓ వ్యక్తి మృతి చెందాడు. సీఐ చిన్నగోవిందు కథనం మేరకు..చిత్తూరు జిల్లా వెదురుకుప్పం మండలం కిచ్చమామానాయుడుపల్లికి చెందిన కంకలపాటి మురళి(44) కుటుంబం తిరుపతిలోని ఉంటోంది. ఇతడికి ఇద్దరు పిల్లలు. కార్వేటినగరంలో కిరాణా షాపు ఉంది. రోజూ పనులు ముగించుకుని కారులో తిరుపతికి వచ్చి వెళ్లే వారు. ఈ క్రమంలో మంగళవారం రాత్రి తిరుపతికి వస్తుండగా చిగురువాడ వద్ద స్వర్ణముఖి నది బ్రిడ్జిపై వంతెన దాటే సమయంలో టైరు పంక్చరై కారు బోల్తా పడింది. స్థానికులు గుర్తించి క్షతగాత్రుడిని రుయాకు తరలించారు. అప్పటికే ఆయన మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతుడి భార్య లత ఫిర్యాదు మేరకు ఎస్ఐ షేక్ షావలి కేసు నమోదు చేశారు.



మృతి చెందిన మురళి

రోజంతా పవిత్ర ఘడియలే

- ఎప్పుడైనా పుష్కరణ స్నానం చేయొచ్చన్న ఈవో



పుష్కరిణి వద్ద ఏర్పాట్లపై సూచనలిస్తున్న ఏకే సింఘాల్

తిరుమల, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): 'గురువారమంతా పవిత్ర ఘడియలే. ఎప్పుడైనా శ్రీవారి పుష్కరిణిలో పుణ్యస్నానాలు ఆచరించొచ్చు. భక్తులు సంయమనంతో వ్యవహరించాలి'అని టీటీడీ ఈవో అనిల్‌కుమార్ సింఘాల్ సూచించారు. గురువారం ఉదయం జరిగే చక్రస్నానానికి సంబంధించిన ఏర్పాట్లను బుధవారం ఆయన జేఈవో వి.వీరబ్రహ్మం, ఎస్పీ సుబ్బరాయుడు, సీవీఎస్వో మురళీకృష్ణతో కలిసి పరిశీలించారు. వెయ్యి మంది పోలీసులు, 1300 మంది టీటీడీ విజిలెన్స్‌తో భద్రతను కట్టుదిట్టం చేశామన్నారు. ఈతగాళ్లు, బోటును అందుబాటులో ఉంచుతున్నట్లు తెలిపారు. కాగా, ఉదయం 6 నుంచి 9 గంటల వరకు వరాహస్వామి ఆలయం వద్ద పుష్కరిణిలో శ్రీదేవి, భూదేవి సమేత మలయప్పస్వామికి, చక్రత్తాళ్వార్‌కు స్నపన తిరుమంజనాన్ని నిర్వహిస్తారు. ఆ తర్వాత చక్రత్తాళ్వారు సహా అర్చకులు మూడు మునకలు వేసి చక్రస్నానం ముగుస్తుంది. భక్తుల కోసం పుష్కరిణిలో గ్యాలరీలు, స్నానఘట్టాలు ఏర్పాటు చేశారు.

ఆల్ ది బెస్ట్

- అంకితభావంతో పని చేయండి
- కొత్త టీచర్లకు ఎమ్మెల్యే సన్మానం



ఎంపికైన ఉపాధ్యాయులతో ఎమ్మెల్యే

పుత్తూరు, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): నగరి నియోజకవర్గం నుంచి డీఎస్సీలో టీచర్లుగా ఎంపికైన వారికి ఆల్‌ది బెస్ట్ చెబుతూ ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ సన్మానించారు. గౌరవప్రదమైన వృత్తిలో ప్రవేశిస్తున్న వాళ్లందరూ అంకిత భావంతో పనిచేయాలని కోరారు. నియోజకవర్గంలోని 109 మంది ఉపాధ్యాయులను కుటుంబాల సహా బుధవారం పుత్తూరులో ఆయన సన్మానించారు. తానూ ఉపాధ్యాయ కుటుంబం నుంచి వచ్చానని గుర్తు చేశారు. మెగా డీఎస్సీని నిర్వహించి ఎన్నికల వాగ్దానాన్ని తమ ప్రభుత్వం నిలబెట్టుకుందన్నారు. టీడీపీ నాయకులు గణేష్, యుగంధర్, ఏలుమలై, షణ్ముగం రెడ్డి, భాస్కరరెడ్డి, జనసేన నాయకుడు మహేష్, డీవైఈవో మహేష్, మున్సిపల్ కమిషనర్ మంజునాథ గౌడ, ఐదు మండలాల ఎంఈవోలు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు కింద పడి వ్యక్తి మృతి

పాకాల, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): పాకాల మండలం దామలచెరువు హైస్కూల్ గేట్ సమీపాన బుధవారం మధ్యాహ్నం ఆర్టీసీ బస్సు ఢీకొని మొగరాల పంచాయతీ కృష్ణాపురం దళితవాడకు చెందిన ఐ.రఘు (63) మృతిచెందారు. ఈయన రోడ్డు దాటుతుండగా చిత్తూరు నుంచి పీలేరు వెళ్తున్నఆర్టీసీ బస్సు ఢీకొంది. సీఐ సుదర్శన ప్రసాద్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



మృతిచెందిన రఘు

27న నిధి ఆప్‌కే నికత్

తిరుపతి(కల్చరల్), అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో భాగంగా ప్రతి నెలా 27వ తేదీన నిధి ఆప్‌కే నికత్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తిరుపతి ప్రాంతీయ పీఎఫ్ కమిషనర్ సతీష్‌కుమార్ బుధవారం తెలిపారు. ఉద్యోగులు, యజమానులు, పెన్షనర్లు, చందాదారులకు నిరంతరం అందుబాటులో ఉండాలనే లక్ష్యంలో ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని ప్రవేశపెట్టిందన్నారు. కడప ప్రాంతీయ ప్రావిడెంట్ ఫండ్ సంస్థ కమిషనర్ సి.రవితేజకుమార్‌రెడ్డి, తిరుపతి ప్రావిడెంట్ ఫండ్ సంస్థ సహాయ కమిషనర్ పి.వీరభద్రస్వామి తదితరులు పాల్గొన్నారు.

5న బెంగళూరు, హైదరాబాదుకు అదనపు సర్వీసులు

తిరుపతి(ఆర్టీసీ),అక్టోబరు1(ఆంధ్రజ్యోతి): దసరా సెలవులనంతరం తిరుగు ప్రయాణమయ్యే వారి కోసం ఈనెల 5న బెంగళూరుకు 20, హైదరాబాదుకు 5 బస్సులు అదనంగా నడపాలని ఆర్టీసీ అధికారులు నిర్ణయించారు. ఈ మేరకు డిప్యూటీ సీటీఎం విశ్వనాథం ఆన్‌లైన్ బుకింగ్ ఓపెన్ చేయించారు.

పోలీసుల అదుపులో అంతర్రాష్ట్ర మహిళా ముఠా!

తిరుపతి(నేరవిభాగం), అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): మాయమాటలతో వినియోగదారులను బురిడీ కొట్టించి బంగారు నగలు, మొబైల్ ఫోన్లు అపహరించే అంతర్రాష్ట్ర మహిళా ముఠాను బుధవారం తిరుపతి పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. విశ్వసనీయ వర్గాల సమాచారం మేరకు.. పోలీసు అధికారులకు అందిన సమాచారం మేరకు తిరుపతి ఆర్టీసీ బస్టాండు, రైల్వే స్టేషన్ తదితర ప్రాంతాల్లో మఫ్టీలో పోలీసుల బృందాలతో నిఘా ఉంచారు. ఆర్టీసీ బస్టాండులో అనుమానాస్పద రీతిలో తిరుగుతున్న దాదాపు నలుగురు మహిళలను అదుపులోకి తీసుకున్నారు. ప్రయాణికులు బస్సు ఎక్కే సమయంలో రద్దీచూసి బంగారు నగలు, మొబైల్ ఫోన్లు కొట్టేస్తున్నారు. ఇప్పటి వరకు నెల్లూరు, విజయవాడ, తిరుపతి, కడప, ఒంగోలు వంటి ప్రాంతాల్లో దొంగతనాలకు పాల్పడినట్లు విచారణలో వెల్లడైనట్లు సమాచారం.

ఇంజనీరింగ్ విద్యార్థి ఆత్మహత్య

తిరుపతి(నేరవిభాగం), అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): ప్రేమ విఫలమై ఓ విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్ఐ నాగార్జునరెడ్డి కథనం మేరకు..అలిపిరి పరిధిలోని ఎస్‌బీఐ కాలనీకి చెందిన కె.లోకేష్(20) బీటెక్ మూడవ సంవత్సరం చదువుతున్నాడు. నగరానికి చెందిన ఓ యువతి ప్రేమలో పడ్డాడు. కొంత కాలంగా వీరి మధ్య మనస్పర్థలు వచ్చాయి. ఈ క్రమంలో బుధవారం ఇంట్లో ఫ్యానుకు ఉరేసుకున్నాడు. లోకేష్ తల్లి ఫిర్యాదు మేరకు ఎస్ఐ కేసు నమోదు చేశారు.

తాళం వేసిన ఇళ్లే లక్ష్యంగా చోరీలు

ఏడుగురు నిందితుల అరెస్టు ● 241 గ్రాముల బంగారు, 1.5 కిలోల వెండి వస్తువులు స్వాధీనం

తిరుపతి(నేరవిభాగం), అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): తాళం వేసిన ఇళ్లే లక్ష్యంగా దొంగతనాలకు పాల్పడుతున్న ఏడుగురిని తిరుచానూరు పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. ఎంఆర్‌పల్లె పోలీసు స్టేషన్‌లో బుధవారం ఈ వివరాలను అదనపు ఎస్పీ రవిమనోహరాచ్చారి మీడియాకు వెల్లడించారు. 'పశ్చిమగోదావరి జిల్లా లక్కవరానికి చెందిన తోట శివకుమార్, తోట వరలక్ష్మి, వెంకటేష్(తిరుపతి), అజీజ్(కడప), దేవి(రైల్వే కోడూరు మండలం మాధవరంపాడు), గాయత్రిదేవి(అనకాపల్లి), రాధాకృష్ణ(అశ్వరావుపేట) ముఠాగా ఏర్పడ్డారు. తిరుపతి, కడప, చుట్టు పక్కల జిల్లాల్లో దొంగతనాలకు పాల్పడ్డారు. పగటిపూట తాళాలు వేసున్న ఇళ్లను గమనించి.. రాత్రికి దొంగతనం చేసేవారు. ఇలా సెప్టెంబరు10న అర్ధరాత్రి దాటాక మంగళం తుడా క్వార్టర్సులో గోవిందరాజులు ఇంటి తాళం పగుల కొట్టి బంగారు ఆభరణాలు, వెండి వస్తువులు అపహరించుకుపోయారు. డీఎస్పీ ప్రసాద్ నేతృత్వంలో సీఐ సునీల్‌కుమార్, ఎస్ఐలు జగన్నాథ రెడ్డి, అరుణ, సాయినాథ చౌదరి, సిబ్బంది బృందాలుగా పాత నేరస్తుల కోసం సాంకేతిక ఆధారాలతో గాలించి నిందితులను గుర్తించారు. బుధవారం మంగళం ఆర్టీవో కార్యాలయ సమీపంలో వారిని అదుపులోకి తీసుకున్నారు. 241 గ్రాముల బంగారు నగలు, 1.5 కిలోల వెండి వస్తువులు స్వాధీనం చేసుకున్నారు' అని ఏఎస్పీ వివరించారు. వీరిపై కేసు నమోదు చేసి నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు సీఐ చెప్పారు.



నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్న బంగారు నగలు, వెండి వస్తువులు

పీహెచ్‌సీ వైద్యుల సమ్మెబాట

- ప్రత్యామ్నాయంగా ఎస్వీఎంసీ వైద్యులతో విధులు

తిరుపతి(వైద్యం), అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): తమ సమస్యలను పరిష్కరించాలంటూ ఏపీపీహెచ్‌సీడీఏ ఆధ్వర్యంలో జిల్లాలోని 58 పీహెచ్‌సీల పరిధిలోని వైద్యులు బుధవారం సమ్మెబాట పట్టారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. 20 శాతం సర్వీసు, పీజీ రిజర్వేషన్‌ను అన్ని బ్రాంచులకు వర్తింపజేయాలని, నోషనల్ ఇంక్రిమెంట్లను మంజూరు చేయాలని, పని గంటలు, స్థిరమైన వారాంతపు సెలవులకు జాబ్‌చార్ట్ అమలు చేయాలని పీహెచ్‌సీ వైద్యుల సంఘం నేత హరికృష్ణ కోరారు. వీటిని నెరవేర్చే వరకు సమ్మె కొనసాగిస్తామన్నారు. ఈ క్రమంలో రోగులకు ఇబ్బందులు తలెత్తకుండా ప్రభుత్వం ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసింది. ఎస్వీ వైద్య కళాశాల నుంచి 58 మంది వైద్యులను పీహెచ్‌సీలకు పంపినట్లు డీఎంహెచ్‌వో బాలకృష్ణ నాయక్ తెలిపారు. సమ్మె ముగిసే వరకు వీరు విధుల్లో ఉంటారన్నారు.




చిల్లకూరు: మహిషాసురమర్దిని అలంకారంలో ముత్యాలమ్మ


గూడూరు: కాత్యాయనీదేవి అలంకారంలో నారాయణమ్మ



రాజరాజేశ్వరి అలంకారంలో సూళ్లూరుపేట చెంగాళమ్మ - అమ్మవారికి సారె తీసుకెళ్తున్న పోలీసులు


నాయుడుపేట: మహిషాసుర మర్దిని అలంకారంలో మూకాంబికాదేవి


వెంకటగిరి: మహిషాసురమర్దిని అలంకారంలో కాత్యయనీదేవి

ఆకట్టుకున్న అమ్మవార్ల అలంకారాలు

సూళ్లూరుపేట, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలోని చెంగాళమ్మ ఆలయంలో జరుగుతున్న దసరా ఉత్సవాల్లో భాగంగా బుధవారం చెంగాళమ్మ పరమేశ్వరి అమ్మవారు రాజరాజేశ్వరి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం అభిషేకం చేసి అమ్మవారి మూలవిరాట్‌ను పుష్పాలతో అలంకరించారు. ఈ సంద ర్భంగా చండీయాగం వైభవంగా నిర్వహించారు. పోలీసుశాఖ నుంచి సీఐ మురళికృష్ణ-మోహిని సూళ్లూరుపేట, తడ, దొరవారిసత్రం ఎస్‌ఐలు బ్రహ్మానాయుడు, అణు కొండపనాయుడు, అజయ్‌కుమార్, మాధవి దంపతులు, సిబ్బంది పోలీసుస్టేషన్ నుంచి మేళతాళాలతో ఊరే గింపుగా వెళ్లి అమ్మవారికి సారె సమర్పించారు. అలంకారానికి ముద్ద లూరు మురళికృష్ణ, అనిత, చండీయాగానికి అట్రంబాకం దొరబాబు రెడ్డి, సుహాసిన దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు.

నాయుడుపేట: పట్టణంలోని మూకాంబికాదేవి, పోలేరమ్మ, అంకమ్మ, మానసాదేవి, దుర్గాదేవి అమ్మవార్లు మహిషాసుర మర్దిని అలంకరణలో దర్శనమిచ్చారు.

గూడూరు: స్థానిక సాయిసత్సంగ నిలయంలోని విజయదుర్గాదేవి ఉపపీఠంలో అమ్మవారిని, బజారుకలశం వద్ద అమ్మవారిని, రాజ రాజేశ్వరీదేవి ఆలయంలో అమ్మవారిని, ధర్మరాజస్వామి ఆలయంలోని ద్రౌపదిదేవిని, గంగమ్మ ఆలయంలో అమ్మవారిని మహిషాసురమర్దిని అలంకారంలో, కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారిని చాముండేశ్వ రిదేవిగా అలంకరించి పూజలు నిర్వహించారు. భక్తులు పాల్గొని అమ్మవార్లను దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

చిల్లకూరు: మండలంలోని తూర్పుకనుపూరు గ్రామంలో వెలసిన ముత్యాలమ్మను మహిషాసురమర్దినిగా అలంకరించి పూజలు నిర్వ హించారు. అర్థరథంపై ఉంచి గ్రామోత్సవం జరిపారు. కలవకొండ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఆదిలక్ష్మీదేవిని ధనలక్ష్మీదేవిగా అలంక రించి పూజలు చేశారు.

డక్కిలి: మండలంలోని దేవునివెల్లంపల్లి స్తంభాలగిరి ఈశ్వరయ్య స్వామి ఆలయంలో పార్వతీదేవి మహిషాసురమర్దిని అలంకరణలో భ క్తులకు దర్శనమిచ్చారు.

వెంకటగిరి టౌన్: పట్టణంలోని వాసవి కన్యకాపరమేశ్వరికి శయన అలంకారం, మూలవిరాట్‌కు రజత కవచ, కర్ణకమ్మ వీధిలోని హరహర క్షేత్రంలో కాత్యయనీదేవికి మహిషాసుర మర్దిని అలంకారం, వెంకటే శ్వర స్వామికి కల్కి అవతారం, మందనాంచరేశ్వరికి కనకదుర్గాదేవిగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు.

కోట: గూడలిలోని రామలింగ చాముండేశ్వరి అమ్మవారిని, కోటలోని దుర్గాదేవి, వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారిని మహిషాసుర మర్దినిగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు.


గూడూరు: చాముండేశ్వరిదేవి అలంకారంలో కన్యకాపరమేశ్వరి



కోట: మహిషాసురమర్దిని అలంకారంలో దుర్గాదేవి


కోట: మహిషాసురమర్దిని అలంకారంలో చాముండేశ్వరి


గూడూరు: కాత్యాయనీదేవి అలంకారంలో నారాయణమ్మ


వెంకటగిరి: వాసవి కన్యకాపరమేశ్వరికి శయన అలంకారం


డక్కిలి: మహిషాసురమర్దిని అలంకారంలో పార్వతీదేవి


కోట: మహిషాసుర మర్దిని అలంకారంలో కన్యకా పరమేశ్వరి

పుత్తూరు వార్తలు

మహిషాసురమర్దినిగా ద్రౌపదిదేవి దర్శనం


మహిషాసురమర్దినిగా ద్రౌపది దేవి


రాజరాజేశ్వరి దేవిగా కామాక్షమ్మ


కంచి కామాక్షిదేవిగా నాగాలమ్మ

పుత్తూరు టౌన్, అక్టోబర్ 1(ఆంధ్రజ్యోతి): దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పట్టణంలోని ద్రౌపదిదేవి సమేత ధర్మరాజ స్వామి ఆలయంలో అమ్మవారిని మహిషాసురమర్దినిగా అలంకరించారు. సదాశివేశ్వరస్వామి ఆల యంలో కామాక్షమ్మను రాజరాజేశ్వరిగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ అమ్మవారికి ప్ర త్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ నిర్వాహకులు అమ్మవారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. రైల్వే క్వార్టర్స్‌లో కొలువై ఉన్న నాగాలమ్మ ఆలయంలో అమ్మవారిని కంచి కామాక్షి దేవిగా అలంకరించారు. రాచ పాళెంలో ఉన్న లక్ష్మీకనకదుర్గమ్మ ఆలయంలో అమ్మవారు మహిషాసుర మర్దినిగా భక్తులను కటాక్షించారు.

ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీలో జాప్యం

- కార్యాలయాలకే పరిమితమైన సచివాలయ సిబ్బంది
- మీ వల్ల కాకపోతే వదిలేయండి
- పుత్తూరు టీడీపీ పట్టణ అధ్యక్షుడి మండిపాటు
- జాబ్ చార్ట్ లేదంటూ సచివాలయ సిబ్బంది సమాధానం


రాచపాలెం హరిజనవాడలో పెన్షన్ అందిస్తున్న ఎమ్మెల్యే భానుప్రకాష్

పుత్తూరు అర్బన్, అక్టోబర్1(ఆంధ్రజ్యోతి): పుత్తూరు మున్సిపాలిటీ పరిధిలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీలో జాప్యం నెలకొంది. కూటమి ప్రభుత్వంలో వేకువ జామున ఇంటి వద్దనే పెన్షన్ తీసుకునే లబ్ధిదారులు బుధవారం కూడా ఆశగా ఎదురుచూశారు. ఎంతకీ సచివాలయ సిబ్బంది రాకపోవడంతో సమాచారం తెలుసుకుని లబ్ధిదారులు ఉదయం 10 గంటలకు సంబంధిత సచివాలయాలకు చేరుకుని పెన్షన్‌ను పొందారు. పలు వార్డుల్లో వృద్ధులు, వికలాంగులకు మాత్రం సచివాలయ సిబ్బంది ఇళ్లకు వెళ్లి పింఛన్లు అందించారు. సాయంత్రం 4 గంటలకు రాచపాలెం హరిజనవాడలో ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ లబ్ధిదారులకు పింఛన్లను అందజేశారు. వికలాంగులు, వృద్ధులు మినహా మిగిలిన లబ్ధిదారులకు కార్యాలయాల్లోనే సిబ్బంది పెన్షన్‌లు పంపిణీ చేశారు.

నగదు ఎందుకు తీసుకున్నారు..



పెన్షన్‌ను పంపిణీ చేయలేని పరిస్థితుల్లో నగదును ఎందుకు విత్ డ్రా చేశారంటూ పుత్తూరు టీడీపీ పట్టణ అధ్యక్షుడు గాలి జీవర త్నం నాయుడు ఆరేటమ్మ కాలనీ పరిధిలోని సచివాలయ సిబ్బందిని ప్రశ్నించారు. పెన్షన్ పంపిణీ చేయమని చెబితే అధికారులు ప్రత్యా మ్నాయ చర్యలు తీసుకుని ఉంటారన్నారు. ఇం టి వద్దనే ఇవ్వాల్సిన పింఛన్లను ఇవ్వడానికి ప్రజలను కార్యాలయాలకు పిలిపించి ఇబ్బం దులకు గురిచేయడం సబబు కాదని హితవు పలికారు. సంక్షేమ పథకాలను ప్రజలకు అందజేసే ఉద్యోగం కన్నా అంతకు మించి ఏం పని ఉందంటూ నిలదీశారు. కూటమి ప్రభుత్వానికి చెడ్డ పేరు తెచ్చేలా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. చెర్లోపల్లి, చినరాజకుప్పంలో పెన్షన్లు పంపిణీ చేయాలని కోరారు. సచివాలయం ఉద్యోగి శ్రీకాంత్ మాట్లా డుతూ.. ఎవరికీ ఇబ్బందులు కలిగించలేదన్నారు. వృద్ధులు, వికలాంగులకు ఇంటి వద్దకే వెళ్లి పంపిణీ చేస్తున్నామని, మిగిలిన వారిని మాత్రమే కార్యాలయానికి వచ్చి తీసుకోమని చెప్పామని సమాధానం ఇచ్చారు. రాష్ట్ర అసోసియేషన్ ఆదేశాల మేరకు ఆత్మగౌరవ నిరసన కార్యక్రమం చేపడుతున్నట్లు వివరించారు. తమకు జాబ్ చార్ట్ లేదంటూ వాపోయాడు. బుధవారం ఉదయం 10 గంటలకు ఈ వివాదం చోటుచేసుకుంది.

- పుత్తూరు మున్సిపాలిటీ పరిధిలోని మిట్టపల్లూరు, కొత్త తిమ్మాపురం గ్రామంలో వన్నియకుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ షణ్ముగం రెడ్డి ఆధ్వర్యంలో సచివాలయ సిబ్బంది ద్వారా లబ్ధిదారులకు పింఛన్లను అందజేశారు. కేబీఆర్‌పురం పంచాయతీలో టీడీపీ మండల అధ్యక్షుడు అరవ బాలాజి పెన్షన్లను పంపిణీ చేశారు.

జీఎస్టీ తగ్గుదలతో రైతులకు మేలు: విజయశ్రీ


ర్యాలీలో ట్రాక్టర్‌ను నడుపుతున్న ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ

నాయుడుపేట టౌన్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): వ్యవసా యోత్పత్తులపై జీఎస్టీ తగ్గింపుతో రైతులకు మేలు జరుగుతుందని సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ అన్నారు. బుధవారం పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నుంచి ఏఎంసీ గోదాం వరకు ట్రాక్టర్‌తో జీఎస్టీపై అవగాహన ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశానికి వెన్నెముక లాంటి రైతన్నలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేయూత నివ్వడం సంతోషించదగ్గ విషయమన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయశాఖ అధికారి ఎస్.ప్రసాద్‌రావు, జిల్లా ఉద్యానవనశాఖ అధికారి దశరధరామిరెడ్డి, జీఎస్టీ అసిస్టెంట్ కమిషనర్ ప్రవీణ్‌కుమార్, ఏపీఎంఐపీ పీడీ చిన్నరెడ్డప్ప, జిల్లా కార్యాలయ ఏడీఏ ధనంజయరెడ్డి, నాయుడుపేట ఏడీఏ నాగార్జునసాగర్, వ్యవసాయశాఖ అధికారి గణేష్ తదితరులు పాల్గొన్నారు.

పోలేరమ్మకు పొంగళ్లు



డక్కిలి, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంబులూ రులో గ్రామశక్తి పోలేరమ్మకు గ్రామస్తులు పొంగళ్లు పెట్టారు. నైవే ద్యం సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహంచారు. ఏటా పంటలు బాగా పండితే గ్రామస్తులు అమ్మవారికి పొంగళ్లు పెట్టడం ఆనవా యితీ. ఈ ఏడాది వర్షాలు బాగా కురిసిన పంటలు సమృద్ధిగా పండి న క్రమంలో గ్రామస్తులు అమ్మవారికి తమ కృతజ్ఞత భావాన్ని వ్యక్త పరుస్తూ నైవేద్యంగా పొంగళ్లు పెట్టి మొక్కులు తీర్చుకున్నారు.


ఆలయం వద్ద ఐఏఎస్ అధికారి అజయ్‌జైన్

ముక్కంటి సేవలో ప్రముఖులు


ఆలయం వద్ద జస్టిస్ మానవేంద్రనాథ్‌రాయ్

శ్రీకాళహస్తి, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని బుధవారం పలువురు ప్రముఖులు వేర్వే రుగా దర్శించుకున్నారు. గుజరాత్ హైకోర్టు జడ్జి జస్టిస్ మాన వేంద్రనాథ్ రాయ్, రాష్ట్ర హౌసింగ్ డిపార్ట్‌మెంట్ స్పెషల్ చీఫ్ సెక్ర టరీ అజయ్‌జైన్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయ అధికారులు వారికిస్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం మృత్యుంజయస్వామి సన్నిధిలో వేదపండితులు వారిని ఆశీర్వదించి స్వామిఅమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు.

కనకదుర్గమ్మ సేవలో ఈవో



శ్రీకాళహస్తి, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా కనకాచలంపై కొలువై ఉన్న కనకదుర్గమ్మను ఈవో బాపిరెడ్డి బుధవారం దర్శించుకున్నారు. వేదపండితులు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ పరిసరాలను పరిశీలించి అధికారులకు పలు సూచలను చేశారు.

ఇంటింటికీ వెళ్లే విధులు మాకొద్దు


ఎంపీడీవోకు వినతిపత్రం ఇస్తున్న సచివాలయ ఉద్యోగులు

ఏర్పేడు, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే విధంగా ఇంటింటికీ వెళ్లే విధులు తమకు అప్పగించవద్దని సచివాల య ఉద్యోగులు అన్నారు. మండల సచివాయల్ల ఉద్యోగులు బుధ వారం ఎంపీడీవో సౌభాగ్యం, డిప్యూటీ తహసీల్దారుకు వినతిపత్రాలు అందజేశారు. ఏపీవీడబ్ల్యూఎస్‌ఈ జేఏసీ రాష్ట్ర కార్యవర్గం పిలుపు మేరకు అఫిషియల్ వాట్సప్ గ్రూపుల నుంచి విరమించుకోవాలని నిర్ణయించుకున్నామన్నారు. ప్రభుత్వ ఉద్యోగులమైన తమకు అప్పగించిన విధులు నిర్వర్తించడానికి తాము సిద్ధంగా ఉన్నామని వలంటీరు విధులు అప్పగించడం బాధాకరమన్నారు.

కోలా ఆనంద్‌కు ఘనసన్మానం


కోలా ఆనంద్‌ను సన్మానిస్తున్న కాత్రపల్లివాసులు

కేవీబీపురం, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): ఇటీవల బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్ష పదవిని పొందిన కోలాఆనంద్‌ను పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు సుబ్రహ్మణ్యం, జిల్లా అధికార ప్రతినిధి కొండేటి గోపాల్, పట్నం విశ్వనాథం ఆధ్వర్యంలో కాత్రపల్లిలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆనంద్ మాట్లాడుతూ... కాత్రపల్లిలో తాను జన్మించ డం తన అదృష్టమన్నారు. కేవీబీపురం మండలాభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని తెలిపారు. 2029లో నియోజకవర్గాల పునర్విభజన జరి గితే కేవీబీపురం మండలాన్ని శ్రీకాళహస్తి నియోజకవర్గంలో చేర్చేం దుకు తాను కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం అన్నదానం చేశారు ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు బాబుయాదవ్, మాజీ మండల అధ్యక్షుడు మునిశేఖర్, హరీష్‌రెడ్డి పాల్గొన్నారు.

వ్యవసాయ అభివృద్ధికి కృషి


సభలో మాట్లాడుతున్న కూరపాటి శంకర్ రెడ్డి

నారాయణవనం, అక్టోబర్ 1(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ సహకార సంఘాల అభివృద్ధికి కృషి చేస్తామని పీఏసీఎస్ సింగిల్ విండో త్రిమెన్ కమిటీ అధ్యక్షుడు షణ్ముగం పేర్కొన్నారు. బుధవారం పీఏసీఎస్ కార్యాలయ ప్రాంగణంలో సత్యవేడు నియోజకవర్గ టీడీపీ ప్రోగ్రాం కోఆర్డినేటర్ కూరపాటి శంకర్ రెడ్డి ఆధ్వర్యంలో అధ్యక్షుడిగా షణ్ముగం, డైరెక్టర్లుగా పొన్నుస్వామి యాదవ్, కిలారి విజయ్‌కుమార్ లు ప్రమాణస్వీకారం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులకు ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సకాలంలో అందేలా చూస్తామన్నారు. అలాగే రైతులకు రుణ సౌకర్యం, రాయితీపై విత్త నాలు, ఎరువులు, పురుగు మందులను అందిస్తామన్నారు. శంకర్ రెడ్డి మాట్లాడుతూ... టీడీపీ ప్రభుత్వంలోనే అన్ని వర్గాల సంక్షేమం ఉంటుందన్నారు. యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహయాదవ్, డీసీసీబీ చైర్మన్ అమాస రాజశేఖర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే హేమలత, టీడీపీ మండల అధ్యక్షుడు గిరిబాబు తదితరులు పాల్గొన్నారు.

జీఎస్టీపై అవగాహన


శ్రీకాళహస్తిలో అవగాహన కల్పిస్తున్న స్వరాజ్యలక్ష్మి

శ్రీకాళహస్తి, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం సూపర్ జీఎస్టీ - సూపర్ సేవింగ్స్‌పై అవగాహన కార్యక్రమం, ట్రాక్టర్ల ర్యాలీ నిర్వహించారు. జీఎస్టీ డిప్యూటీ అసిస్టెంట్ కమిషనర్ స్వరాజ్యలక్ష్మి మాట్లాడుతూ... వ్యవసాయ, అనుబంధ రంగాల్లో ఉపయోగించే ట్రాక్టర్లు, పనిముట్లు, స్ప్రేయర్లు, డ్రిప్పు యంత్రాలు, బయో ఫెర్టిలైజర్స్ వంటి వాటిపై గతంలో 12 శాతం ఉన్న ట్యాక్స్ 5శాతానికి చేరుకుందన్నారు. ఏఈవో హరిబాబునాయక్, అధికారులు శ్రీనివాసులు, శ్యామ్, రమేష్‌రెడ్డి, సురేంద్రరెడ్డి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

బుచ్చినాయుడుకండ్రిగ (ఆంధ్రజ్యోతి): జీఎస్టీ తగ్గింపుపై విస్తృతంగా అధికారులు ప్రజలకు అవగాహన కల్పించాలని మండల వ్యవసాయ అధికారి షణ్ముగం తెలిపారు. మండల కేంద్రంలో జీఎస్టీ తతగ్గింపుపై టీడీపీ నాయకులు, వ్యాపాలతో కలిసి ర్యాలీ నిర్వహించారు. సుధాకర్‌నాయుడు, రవినాయుడు, గోపి, సురేంద్ర, ఉషారాణి, ఏఈవో రేవతి పాల్గొన్నారు.

ఏర్పేడు (ఆంధ్రజ్యోతి): మండలం వికృతమాలలో జీఎస్టీ సేవింగ్స్‌పై జీఎస్టీ అసిస్టెంట్ కమిషనర్ రేణుక ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఎంపీడీవో సౌభాగ్యం, ఏవో సాగరిక, ప్రభుత్వ వైద్యాధికారి శివప్రియ, టీడీపీ నాయకుడు హేమాక్షి రాయల్ తదితరులు పాల్గొన్నారు.

సత్యవేడు (ఆంధ్రజ్యోతి): జీఎస్టీ తగ్గింపుతో పేద , మధ్య తరగతి వారికి లబ్ధి చేకూరుతోందని జీఎస్టీ అడిషనల్ కమిషనర్ మురళీకృష్ణ తెలిపారు. బుధవారం మండలంలోని మదనంబేడులో ఏడీఏ సుబ్రమణ్యం ఆధ్వర్యంలో సత్యవేడు వరకు ట్రాక్టర్లతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఏవో మురళి, వెటర్నరీ ఏడీ అఫ్సర్ సయ్యద్, ఎంపీడీవో త్రివిక్రమరావు, టీడీపీ మండల అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్ రెడ్డి, నాయకులు సుందరరామిరెడ్డి, పరమశివం, లోకయ్యరెడ్డి, సర్పంచ్ రవిరెడ్డి, మోహన్, షణ్ముగం, ప్రభాకర్‌రెడ్డి, చిట్టిరెడ్డి, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

వరదయ్యపాళెం (ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఏవో గౌరి ఆధ్వర్యంలో ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో మండలంలోని రైతులు, ట్రాక్టర్ యజమానులకు జీఎస్టీ తగ్గింపుపై అవగాహన కల్పించారు. అనంతరం పట్టణంలో ట్రాక్టర్లతో ర్యాలీ నిర్వహించారు.

రేణిగుంట (ఆంధ్రజ్యోతి): మండల వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో సూపర్ జీఎస్టీ, సూపర్ సేవింగ్స్‌పై గాజులమండ్యంలో అవగాహన కల్పించారు. వ్యవసాయ శాఖ అధికారి సునీల్ కుమార్‌రెడ్డి సహకార సంఘం అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, నీటి సంఘాల అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం, జీఎస్టీ అసిస్టెంట్ కమిషనర్ నూర్జహాన్, స్వప్న, ఎంపీడీవో రవిచంద్ర తదితరులు పాల్గొన్నారు.

పెద్దపాలేడులో సమస్యలు పరిష్కరించండి

- ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం


పింఛన్ పంపిణీలో ఎమ్మెల్యే

బుచ్చినాయుడుకండ్రిగ, అక్టోబర్ 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్ద పాలే డులో సమస్యలను పరిష్కరిం చాలని ఎమ్మెల్యే ఆదిమూలం అధికారులను కోరారు. గ్రా మంలో బుధవారం ఉదయం ఆయన పింఛన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా దళితులు పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. తమ గ్రామ రహదారి రాళ్లు తేలి ప్రయాణానికి ఇబ్బందిగా మారిందన్నారు. శ్మశానానికి వెళ్లడానికి రోడ్డు వసతి లేదన్నారు. పక్కా గృహాలు మంజూరు చేయాలన్నారు. మురుగు నీటి కాలువలు నిర్మించాలని కోరారు. ఇన్‌చార్జి ఎంపీడీవో మోతి, పీఆర్ ఎస్ఈ మధుసూదన్, ఏఈ నాగరాజు, ఏపీఎం మునెయ్య, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. బీఎన్‌కండ్రిగ పంచాయతీలో మండల టీడీపీ అధ్యక్షుడు సుధాకర్‌నాయుడు ఆధ్వర్యంలో పెన్షన్లను పంపిణీ చేశారు.

ఘనంగా స్వచ్ఛతా హీ సేవ



వైద్యశిబిరాన్ని ప్రారంభిస్తున్న విజయ్‌కుమార్

శ్రీకాళహస్తి, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎంజీఎం ఆస్పత్రి వద్ద స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛతా హీ సేవ కా ర్యక్రమాన్ని ఘనంగా నిర్వ హించారు. ఈ కార్యక్రమా నికి టీడీపీ పట్టణ ధ్యక్షుడు విజయకుమార్, పురపాలక సంఘ కమిషనర్ భవానీ ప్రసాద్, ఎంజీఎం డైరెక్టర్ గుడ్లూరు మయూర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంజీఎం ఆస్పత్రి వద్ద నిర్వహించిన వైద్యశిబిరంలో సుమారు 150మంది పురపాలకసంఘ పారిశుధ్య కార్మికులకు వైద్య సేవలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు.











శ్రీకాళహస్తి సత్యవేడు

జగన్మాతా... పాహిమాం


మహిషాసురమర్దినిగా మరగదాంబిక


మహిషాసురమర్దినిగా కనకదుర్గమ్మ


మహిషాసురమర్దినిగా ముత్యాలమ్మ


మహిషాసురమర్దినిగా దక్షిణ కాళికాదేవి


మహిషాసురమర్దినిగా కరుమారియమ్మ


మహిషాసురమర్దినిగా పొన్నాలమ్మ

శ్రీకాళహస్తి, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): పాహిమాం జగజ్జననీ అంటూ భక్తులు అమ్మవార్లకు మొక్కారు. దసరా ఉత్సవాల్లో భాగంగా బుధవారం వివిధ రూపాల్లో ఆయా ఆలయాల్లో కొలువైన అమ్మవార్లు భక్తులను కటాక్షించారు. శ్రీకాళహస్తీశ్వరాలయంలో కనకదుర్గమ్మ మహిషాసురమర్దినిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయానికి అనుబంధంగా కనకాచలంపై కొలువై ఉన్న కనకదుర్గమ్మను ప్రత్యేకంగా



మహిషాసురమర్దినిగా బీపీ అగ్రహారం చిన్నగంగమ్మ, పెద్దగంగమ్మ


మహిషాసురమర్దినిగా చిట్టత్తూరు పోలేరమ్మ

అలంకరించారు. శ్రీకాళహస్తి మండలం వేడాంలో కొలువై ఉన్న దక్షిణ కాళికాదేవి మహిషాసురమర్దినిగా, బజారువీధిలోని కన్యకాపరమేశ్వరి మూలమూర్తి ప్రత్యేకాలంకారం, ఉత్సవమూర్తి నిత్యసుమంగళిగా దర్శనిమచ్చారు. పానగల్‌లో గంగమ్మ ప్రత్యేక అలంకారంలో, భాస్కరపేట చాముండేశ్వరి, ముత్యాలమ్మ గుడివీధిలోని ముత్యాలమ్మ, పొన్నాలమ్మ, బీపీ అగ్రహారం చిన్నగంగమ్మ, పెద్దగంగమ్మ ప్రత్యేక అలంకారంలో, బహదూరుపేటలోని కన్యకాపరమేశ్వరి, తెట్టు నల్లగంగమ్మ మహిషాసురమర్దినిగా, ఏడుగంగల అమ్మవారు లలితాదేవి అలంకారంలో భక్తులను కటాక్షించారు. విశ్వబ్రాహ్మణవీధిలోని గంగమ్మ, ముత్యాలమ్మ గుడి వీధిలోని నింబజాదేవి, అష్టలక్ష్మి, పూసలవీధి గంగమ్మ, శీతాలాంబ, త్రిశూలాంబ, సంతమైదానం అంకాళమ్మ, పీవీరోడ్డులోని అంకమ్మ విశేషాలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.

సత్యవేడు (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కల్యాణ వీరభద్రస్వామి ఆలయంలో సర్వమంగళా దేవి మహిషాసురమర్దిని అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ధర్మకర్త ఇందూరి రవికుమార్ ఏర్పాట్లను పర్యవేక్షించారు. సాయంత్రం మాదరపాక్కానికి చెందిన నాట్యయుగం అకాడమీ ఆధ్వర్యంలో భరతనాట్య ప్రదర్శన జరిగింది.

వరదయ్యపాళెం (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని చెంగాళమ్మ ఆలయంలో అమ్మవారు మహిషాసురమర్దిని అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు.

ఏర్పేడు (ఆంధ్రజ్యోతి): పాహిమాం తల్లి పాహిమాం అంటూ భక్తులు అమ్మవారి ఆలయాల్లో ప్రణమిల్లారు. చిందేపల్లిలో వెలసిన పార్వతీ దేవి, గుడిమల్లంలో కొలువై ఉన్న పరశురామేశ్వరాలయంలో ఆనందవల్లి మహిషాసురమర్దినిగా భక్తులను కటాక్షించారు.

పిచ్చాటూరు(ఆంధ్రజ్యోతి): మండలంలోని రజానగరం వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారు మహిషాసురమర్దిని అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.


మహిషాసురమర్దినిగా అవనాక్షమ్మ


మహిషాసురమర్దినిగా కామాక్షమ్మ


మహిషాసురమర్దినిగా సర్వమంగళాదేవి







ఆంధ్రజ్యోతి క్లాసిఫైడ్స్

తిరుపతి - 9703618708, 9030367786
9703618705, 9703618710
9985411629, 9985410347, 9985411003
చిత్తూరు - 9985411584, 9985403122
మదనపల్లె - 9985417476, 9848161191
కుప్పం - 9985403032 పలమనేరు - 9985403032
పుంగనూరు - 9985403204, పీలేరు - 9985403045
పుత్తూరు - 9985411598, శ్రీకాళహస్తి - 9985411596

TO-LET
తిరుపతి, నిమ్మకాయలవీధి నందు షాపులకు మరియు గోడౌన్‌కు అనుకూలమైన భవనం అద్దెకు కలదు. సంప్రదించండి. సెల్: 98483 15414
AJT -246079

వాటర్ ప్రూఫింగ్
స్లాబ్ లీకేజీలు, బాత్రూమ్ లీకేజీలు, వాటర్ ట్యాంక్ లీకేజీలు, గోడ చెమ్మలకు పగలకొట్టకుండా గ్యారెంటీగా వర్క్ చేయబడును. సంప్రదించండి. సెల్: 93465 40767
AJT -240225

TO-LET
తిరుపతి – జై నగర్, బ్లిస్ హోటల్ వెనుక 60 అంకణముల వేఢి విశ్వవిహార్ బిల్డింగ్ జి+3 ఉమెన్స్ హాస్టల్ కొరకు అద్దెకు కలదు. సంప్ర. : 99895 68666
AJT - 246078

కళ్యాణ వేదిక
★ ఆర్యవైశ్య & అందరికీ 1ST & 2ND సంబంధాలు చూడబడును. రిజిస్ట్రేషన్ ఫీజు 2118/ మా వద్ద చాలా ప్రొఫైల్స్ కలవు. సంప్ర: RK హ్యాపీ కళ్యాణ్స్ - 8332000801 AJH-003503

CHANGE OF NAME
I, PACHIKALA ANJALI, W/o PACHIKALA CHIRAMJEEVI, R/o D.No.6-68A, Thurpu Harijanawada, Jillellamanda, Kambhamvaripalle Mandal, Annamayya Dist., AP. My name changed from PACHIKALA ANJALI (Old Name) to DODDI PEDDA ANJANAMMA (New Name).
AJT -1680

WANTED
తిరుపతి ఏజెన్సీ చంద్రగిరి నందు పనిచేయుటకు అనుభవం గల టెలికాలర్స్ (M/F) కావలెను. జీతం 25K+More ఇన్సెంటీవ్స్. సెల్: 94410 74755
AJT -1679

బంగారం కొనబడును
మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్, ఫైనాన్స్‌లో తాకట్టులో వున్నవి మా డబ్బుతో విడిపించి కొనబడును. స్పాట్ క్యాష్, షిఫ్టింగ్ చేయబడును (రిటైర్డు పోలీస్ డిపార్టుమెంట్) గోల్డెన్ ట్రేడింగ్ కంపెనీ సంప్ర:7382114647.
AJA- 246733

EDUCATION
➾ Join BSc AI / CSc over 60%, Maths in 10+2 get 5000 Fee dis, Join M.Com / MA Eng / MSW by 6/10, 3000 Fee dis, 9177408565
AJG-248895

పాఠకులకు ముఖ్యగమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు. మేనేజర్ - ఏడివిటి

ముక్కంటి సమేత జ్ఞానప్రసూనాంబ పురవిహారం



శ్రీకాళహస్తి, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): దసరా నవరాత్రులను పురస్కరించుకుని జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళ హస్తీశ్వరుడు పట్టణంలో విహరించారు. ఆలయ అలంకా ర మండపంలో స్వామిఅమ్మవార్ల ఉత్సవమూర్తులకు పలు రకాల అభిషేకాలు నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. ధూప, దీప, నైవేద్యాలు సమర్పించారు. మేళతాళాలు, మం గళవాయిద్యాలు, వేద మంత్రోచ్చరణల నడుమ స్వామి అమ్మవార్లు చప్పరాలపై ఆశీనులై పట్టణంలో విహరిం చారు. భక్తులు పెద్దసంఖ్యలో స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు.

పింఛన్ల పంపిణీ


పింఛన్ అందజేస్తున్న విజయకుమార్

శ్రీకాళహస్తి, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): పట్టణంలో బుధవారం టీడీపీ పట్టణ అధ్యక్షుడు విజయకుమార్ 19వ వార్డు పరిధిలో సచివాలయ ఉద్యోగులతో కలిసి పింఛన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఎన్ని ఆర్థిక ఇబ్బందులున్నా ప్రతి నెలా 1వ తేదీనే లబ్ధిదారులకు పింఛన్లు అందిస్తున్న ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కు తుందన్నారు. గోపీ నాథ్, మధు తదితరులు పాల్గొన్నారు. బహదూరు పేటలో రాష్ట్ర గిరిజన సలహామండలి సభ్యుడు సుబ్బయ్య పింఛన్లను పంపిణీ చేశారు.

మహిషాసురమర్దినిగా మరగదాంబిక

నాగలాపురం(ఆంధ్రజ్యోతి): పల్లికొండేశ్వర ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాల్లో బుధవారం మరగదాంబిక అమ్మవారు మహిషాసురమర్దిని అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. సాయంత్రం ఆలయ వాహన మండపంలో మరగదాంబిక అమ్మవారి ఉత్సవ విగ్రహానికి పంచామృతాభిషేకం నిర్వహించి పట్టు వస్త్రాలతో, బంగారు ఆభరణాలతో అలంకరించి ఊంజల్‌సేవ నిర్వహించారు.

నారాయణవనం (ఆంధ్రజ్యోతి): మండలంలోని సముదాయం గ్రామంలో కొలువై ఉన్న అవనాక్షమ్మ ఆలయంలో అమ్మవారిని సరస్వతి దేవిగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. కైలాసనాథ కోనలోని కామాక్షి అమ్మవారు మహిషాసురమర్దిని అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.









‘గరం గరం చాయ్’ పుస్తకావిష్కరణ

తిరుపతి(కల్చరల్), అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): ఆర్సీ కృష్ణస్వామిరాజు రచించిన గరం గరం చాయ్ పుస్తకావిష్కరణ సభ స్థానిక వేమన విజ్ఞాన కేంద్రంలో పబ్లిక్ రిలేషన్స్ సొసైటీ ఆఫ్ ఇండియా తిరుపతి చాప్టర్ ఆధ్వర్యంలో బుధవారం జరిగింది. ముఖ్య అతిథిగా వచ్చిన త్రిపురలోని దమ్మదీప అంతర్జాతీయ బౌద్ధ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య ఎంపీ నరసింహరావు పుస్తకాన్ని ఆవిష్కరించారు. మాండలికాలు, పల్లెపదాలతో పిల్లల నుంచి పెద్దల వరకు అందరికీ సులువుగా అర్థమయ్యేలా కృష్ణస్వామి రచనలు చేస్తున్నారని కొనియాడారు. తిరుపతికి చెందిన రచయిత, కవి ఎం.ధర్మయ్య, ద్రవిడ విశ్వవిద్యాలయం అసిస్టెంట్ ప్రొఫెసర్ శైలమ్మ మాట్లాడారు. పీఆర్ఎస్ఐ తిరుపతి చాప్టర్ చైర్మన్ జీఎస్.ప్రసాద్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కార్యదర్శి చంద్రమోహన్, మధుసూదన్ పాల్గొన్నారు.


పింఛన్లు పంపిణీ చేస్తున్న గంగమ్మ ఆలయ చైర్మన్ మహేష్ యాదవ్

తిరుపతిలో 95 శాతం పెన్షన్ల పంపిణీ

తిరుపతి, అక్టోబర్ 1 (ఆంధ్రజ్యోతి) : ఎన్టీఆర్ భరోసా పింఛన్లు బుధవారం సాయంత్రం 7 గంటల వరకు 95 శాతం పంపిణీ చేశారు. తిరుపతి నగరపాలక సంస్థ కమిషనర్ మౌర్య, యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహ యాదవ్, మీడియా కోఆర్డినేటర్ శ్రీధర్ వర్మ 15, 19, 30, 31 డివిజన్లలో పంపిణీ చేశారు. 35వ డివిజన్లో డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ పంపిణీ చేశారు. 36వ డివిజన్లో తాతయ్యగుంట గంగమ్మ గుడి చైర్మన్ మహేష్ యాదవ్, కూటమి నాయకులు రవిశంకర్ యాదవ్, ఆవుల శంకర్ యాదవ్, కాకర్ల రూపేష్, ఆముదాల వెంకటేష్, అబ్దుల్లా, ఆవుల శ్రీనివాసులు, ముని, శేషాద్రి, గౌస్‌బాషా, యాసిన్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

సూపర్ సిక్స్ పథకాలు సూపర్ హిట్: టీడీపీ


పింఛన్ల పంపిణీలో పాల్గొన్న పులుగోరు మురళి తదితరులు

తిరుపతి (నేరవిభాగం), అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): సూపర్ సిక్స్ పథకాలు సూపర్ హిట్ అయినట్లు క్లస్టర్ ఇన్‌చార్జి పులుగోరు మురళీకృష్ణారెడ్డి తెలిపారు. తిరుపతి నగరం నెహ్రూవీధి, బండ్ల వీధి, నవాబ్ పేట, ఎస్‌కేడీ నగర్ ప్రాంతాల్లో బుధవారం జరిగిన పింఛన్ల పంపిణీలో ఆయన మాట్లాడారు. పీ మైనారిటీ సెల్ సెక్రెటరీ మహబూబ్ బాషా, 26, 27, 32 డివిజన్ల పార్టీ అధ్యక్షులు గెంజి సుధాకర్ రెడ్డి, నాగ ప్రతాప్, దేవ ఆచార్య, ముని రాజా, సూర్యనారాయణ రెడ్డి, ఎస్‌కేడీ నగర్ విజయ్, జనసేన మోహన్ రాయల్, శరత్ దుష్యంత్, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కేవీ చౌదరికి ఘన సత్కారం

తిరుపతి అర్బన్, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): ఏపీ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీస్ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నియమితులైన కేవీ చౌదరిని బుధవారం తిరుపతి ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. శ్రీవారి చిత్రపటం బహూకరించారు. ఈ కార్యక్రమంలో తిరుపతి ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు మోహన్‌రాజు, కార్యదర్శి వాసుదేవన్, కోశాధికారి రవి, చక్రపాణి, శ్రీధర్, మధుసూదన్, రఘురామిరెడ్డి పాల్గొన్నారు.

ఐద్వా జిల్లా నూతన కార్యవర్గం

తిరుపతి(ఆటోనగర్), అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం(ఐద్వా) జిల్లా నూతన కార్యవర్గ ఎన్నికలు స్థానిక పెద్దకాపు లేఅవుట్‌లోని యూటీఎఫ్ కార్యాలయంలో బుధవారం జరిగాయి. అధ్యక్షురాలిగా కె.ఈశ్వరమ్మ, కార్యదర్శిగా డాక్టర్ పి.సాయిలక్ష్మి, కోశాధికారిగా ఎం.జయంతి, ఉపాధ్యక్షులుగా సత్యశ్రీ, సుజాతమ్మ, సహాయ కార్యదర్శిగా రాధమ్మతోపాటు కమిటీ సభ్యులుగా 11 మంది ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.



ఈశ్వరమ్మ, సాయిలక్ష్మి

నేడు తలకోన ఆలయ పాలక మండలి ప్రమాణ స్వీకారం

ఎర్రావారిపాలెం, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): తలకోన సిద్ధేశ్వర స్వామి ఆలయ పాలక మండలి ప్రమాణ స్వీకార కార్యక్రమం గురువారం జరగనుంది. ఛైర్మన్‌గా సోమనాథరెడ్డి, సభ్యులుగా వీఆర్ శిరివేలు రమేష్, శశికళ, చెంగమ్మ, రాజన్న, ఇందిర, లంకిపల్లె శోభ, చలపతి, ఎం.ఈశ్వరయ్య, ఎక్స్‌అఫిషియో సభ్యుడిగా అర్చకుడు సత్యప్రసాద్ ప్రమాణ స్వీకారం చేయనున్నారు.